

జనా మోదీ..

కూటమిని గెలిపించండి : ప్రధాని మోదీ అభివాదం

మోదీ బాణం : విల్లు ఎక్కుపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ

మోదీ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న పవన్

మోదీ సభలో లోకేశ్ అభివాదం

రాజమహేంద్రవరాన ఉప్పొంగిన ప్రజాగళం

- గోదారులన్నీ జన ప్రవాహమే
- జనంతో నిండిన రాజమహేంద్రి
- ఉభయ జిల్లాల నుంచి రాక
- కాసేపు తెలుగులో మాట్లాడిన మోదీ
- జ్ఞాపికలు అందజేసిన పవన్, లోకేశ్
- ప్రధాని మోదీ సభ విజయవంతం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి గడ్డపై నుంచి ప్రధాని మోదీ గర్జించారు. ఎన్నికల శంఖారావం పూరించారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచే కొత్త చరిత్ర సృష్టిస్తామని ప్రతినబూనారు. ఆదికవి నన్నయ సరికొత్త అధ్యాయం సృష్టించినచోటే ఎన్డీయే కూడా విజయఢంకా పూరిస్తుందని ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ దద్దరిల్లింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి పోటెత్తిన జనప్రవాహంతో మార్మోగింది. అటు ప్రధాని మోదీ, ఇటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితర దిగ్గజాల హాజరుతో సభ కొత్త కళ సంతరించుకుంది. వేలాది మంది కాషాయ టోపీలు ధరించి ఉత్సాహంగా మోదీమోదీ అంటూ నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. పవన్‌కల్యాణ్ వచ్చిన వెంటనే సభలో ఉన్న వేలాది జనం కేరింతలతో గోదావరి ఉప్పెనలా హోరెత్తింది. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రధాని మోదీ సభా వేదికపైకి రాగానే జనం నినాదాలు చేశారు. అటు తన ప్రసంగాన్ని మోదీ తెలుగులో ఆరంభించి అందరినీ అబ్బురపరిచారు. సభకు వచ్చిన రాజమహేంద్రవరం ప్రజలకు నమస్కారాలు అంటూనే గోదావరి తల్లికి తలవంచి నమస్కరిస్తున్నా అనడంతో ప్రాంగణం ఒక్కసారిగా మార్మోగింది.

ఆదికవి నన్నయ నడయాడిన ఈ గడ్డ నుంచి ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతున్నామని చెప్పి గెలిచేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, నరసాపురం లోక్‌సభ అభ్యర్థలతో పాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రాజమహేంద్రవరం విమానాశ్రయం, కాకినాడ పోర్టు, జాతీయ రహదారి మరింత అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చెన్నై-కాకినాడ పారిశ్రామిక కారిడార్ పనులు ఊపందు కుంటాయని చెప్పి ఇక్కడ ప్రజల మనసు చూరగొన్నారు.

కూటమిలో ఫుల్ జోష్...

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, మే 6: కూటమి ఎన్నికల బహిరంగ సభకు విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3:30 గంటలకు సభావేదికపైకి మోదీ చేరుకున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. తొలుత ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, రాజమహేంద్రవరం కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అమలాపురం లోక్‌సభ కూటమి టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు అయ్యాజీ వేమా, కాశీవిశ్వనాథరాజు తదితరులు ప్రధాని మోదీని కలిశారు. సభా వేదికపైన కూటమి అభ్యర్థులను పలకరించారు. అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మోదీ దగ్గరకు వెళ్లి పలకరించగా ఆల్‌ద బెస్ట్ అని భుజం తట్టారు. అటు లోకేశ్ తన సరదా ప్రసంగంతో మోదీని ఆకట్టుకున్నారు. ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా మోదీ తినాలని అనగానే నవ్వులు పూశాయి. లోకేశ్ మాట్లాడే సమయంలో ఆయన ప్రసంగానికి మోదీ చప్పట్లు కొట్టారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని లోకేశ్ మోదీకి అందించారు. మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాను మోదీకి అందించారు. సభా వేదికపైకి మోదీ రాగానే పవన్ మోదీకి శాలువా కప్పారు. అనంతరం కాళ్లకు నమస్కరిస్తుండగా ప్రధాని వారించి అడ్డుకున్నారు. మోదీకి వేంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందించారు. ఇలా ప్రజాగళం సభ రాజమహేంద్రవరంలో కూటమి పార్టీలకు మంచి కిక్ ఇచ్చింది. స్వయంగా మోదీ వచ్చి సభలో పాల్గొనడంతో అభ్యర్థుల్లో విజయంపై మరింత ధీమా పెంచేసింది.





చిరు కానుక : మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న పవన్‌కల్యాణ్, జనసేన అభ్యర్థులు



ఇదీ మా సంప్రదాయం : ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞాపిక ఇస్తున్న టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి మహిళా నేతలు



మోదీ కటౌట్‌తో..



అభిమాని ఉత్సాహం



అంతా ఓకేనా : ప్రధాని మోదీతో మాట్లాడుతున్న లోకేశ్



కూటమి హ్యాపీగా ఉందిలా..



నమస్తే జీ : మోదీకి నమస్కరిస్తున్న ఆదిరెడ్డి భవాని

ఆ ముగ్గురి కలయిక అపూర్వం : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి కలయిక అపూర్వం అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి రాజమండ్రి లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం విధానమైతే, బాధితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే పార్టీ జనసేన అన్నారు. కూటమి కలయిక రాష్ట్రంలో సుపరిపాలనకు దోహదపడుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. గడచిన ఐదేళ్లలో మనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డామని, ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం తన అదృష్టమని, ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు.

కట్టుదిట్టమైన భద్రత

కూటమి ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. జనం తండోపతండాలుగా రావడంతో జాతీయ రహదారి నిండిపోయింది. మహిళలు సైతం అధిక సంఖ్యలో రావడం విశేషం. సభ పూర్తయ్యేంత వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ఓపికగా ఉన్నారు. మోదీ, పవన్, లోకేశ్ ప్రసంగాలకు పెద్దఎత్తున స్పందిస్తూ చప్పట్లతో, నినాదాలతో హోరెత్తించారు. ప్రజాగళం సభకు ప్రధాని మోదీ హాజరు కావడంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఒక అడిషనల్ డీజీ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు ఐజీలు, తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ సహా ఆరుగురు ఎస్పీలు.. మొత్తం సుమారు మూడు వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి చేరుకోవడానికి ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. 35 చెకింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ పరిశీలించి అనుమతించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర గస్తీ కాశాయి. భద్రతా చర్యల్లో భాగంగా వాటర్ బాటిల్, పెన్, సిగరెట్, అగ్గిపెట్టె, గుట్కా, పార్టీ జెండాలను అనుమతించలేదు. మోదీ రాకకు అరగంట ముందు నుంచీ.. ఆయన వెళ్లిన తర్వాత వరకూ వేదిక నుంచి హెలిపాడ్ వరకు జాతీయ రహదారిపై ఎవరినీ అనుమతించలేదు. రత్న ఫ్యాక్టరీ నుంచి వేమగిరి కూడలి వరకు పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. మోదీ వెళ్లిన తర్వాత జనం ఒక్కసారిగా తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. భద్రత దృష్ట్యా వాటర్ బాటిళ్లను తీసుకెళ్లనీయకపోవడంతో గ్యాలరీలు, బయట ప్రాంగణంలో లక్షల లీటర్ల మజ్జిగ అందుబాటులో ఉంచారు. తాగునీరు కూడా ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు.



జయహో మోదీ..



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న కూటమి అభ్యర్థులు



మోదీ సభకు..



బాగున్నారా సార్ : ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న పవన్



మా కూటమి టీమ్ : ప్రజాగళం వేదిక నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కాకినాడ, అమలాపురం ఎంపీ అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్‌మాధుర్, అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



మీకోసమే సార్ : ప్రధాని మోదీకి శాలువా కప్పుతున్న లోకేశ్

ఓటుకు పోటెత్తిన ఉద్యోగులు

- జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- ఎక్కడికక్కడ క్యూకట్టిన ఉద్యోగులు..

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు ఓటుకు పోటెత్తారు.. గత ఐదేళ్లుగా ఎప్పుడెప్పుడు ఓటేద్దామా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. ఎందుకంటే ఉద్యోగుల్లో అంత వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ ఉద్యోగులు ఓటు వేయడానికి బారులుతీరారు. అన్ని జిల్లాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి సోమవారం ఉద్యోగులు క్యూకట్టారు. గతంలో పోస్టల్ బ్యాలెట్‌కు ఇంత స్పందన ఉండేది కాదు. అయితే ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితి మారింది. ఉదయం నుంచి ఉద్యోగులు బారులు తీరారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పీవోలు, ఏపీవోలు, ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్, ఇతర అనుబంధ సిబ్బంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. ఎంత మంది వినియోగించుకున్నారనే లెక్క రాత్రి 12 గంటల వరకూ తేలలేదు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత జేసీ తేజ్‌భరత్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఓటు విలువను ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది చాటి చెప్పారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో, ఏడు చోట్ల శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే 32 విభాగాల ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.రాత్రి 12 గంటలకు కూడా ఎంతమంది ఓటు హక్కు వినియోగించుకున్నారనే వివరాలు ప్రకటించ లేదు. కేవలం రాజానగరం నియోజకవర్గంలో మాత్రం 738 మందికి 703 మంది వినియోగించుకు న్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ దాదాపు ఓటింగ్ శాతం ఇలాగే ఉన్నట్టు సమాచారం.



నిడదవోలులో ఓటు వేస్తున్న ఉద్యోగి



దివాన్‌చెరువులో ఉద్యోగుల క్యూ

దివాన్‌చెరువు, మే 6 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులకు నియమితులైన పీవో, ఏపీవోలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే ఏర్పాటు చేశారు. ఆర్వో చైత్రవర్షిణి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ 50 మంది ఓటర్లకు ఒక ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభమైందన్నారు. రాజానగరం నియోజవర్గానికి 460 మంది పీవో, ఏపీలను కేటాయించారన్నారు. వీరిలో నియోజకవర్గాల వారీగా రాజానగరంలో 40, అనపర్తిలో 17, రాజమండ్రి సిటీలో 95, రూరల్‌లో 75, కొవ్వూరులో 27, నిడదవోలు 44, గోపాలపురం 28, ఇతర జిల్లాలకు చెందిన 128 మంది ఉన్నారన్నారు. మొదటి రోజు పీవో, ఏపీవోలతో పాటు మరో 260 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. వీరు బీఎల్‌వోలు, ఎన్నికల విధులకు నియమితులైన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 7,8 తేదీల్లో ఆర్వో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 8న ఓపీవోలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును బీవీసీ కళాశాలలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా 100 మంది ఓటర్లలోనూ, 98 మంది ఓటు వేశారని ఆర్వో తెలిపారు.



కొవ్వూరులో ఎండలో నిలబడే ఓటుకు ఉద్యోగుల క్యూ



పోస్టల్‌బ్యాలెట్‌లో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఎన్నికల సిబ్బంది

గోపాలపురాన ఓట్లు మాయం..?

నిలదీసిన ఉద్యోగులు.. ఆలస్యంగా ఓటింగ్

గోపాలపురం, మే 6: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సోమవారం మొదటి విడత పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు ప్రక్రియలో గందరగోళం నెలకొంది. గోపాలపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి సోమవారం ఉదయమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేయడానికి 11 ఫెసిలిటియేటర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అయితే జాబితాలో తమ పేర్లు కనిపించకపోయేసరికి గందరగోళం ఏర్పడింది. తమ పేరు జాబితాలో లేదని కంగారుపడిన ఎన్నికల సిబ్బంది ఏఈఆర్వోను నిలదీశారు. దీంతో విషయం తెలుసుకున్న ఆర్వో సమస్యను పరిష్కరించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ఓట్లు ప్రక్రియ ప్రారంభమైంది.

కూటమి వికాసం



సభకు హాజరైన జనం



బుచ్చయ్యచౌదరి



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



ఆదిరెడ్డి శ్రీనివాస్



ముప్పిడి వెంకటేశ్వరరావు





మోదీ కటౌట్‌తో మహిళా అభిమాని



మోదీ ఫొటోలతో..



టోపీలతో సభా ప్రాంగణానికి వెళ్తున్న మహిళలు



లోకేశ్‌తో మహిళా నేతల సెల్ఫీ

మూడు పార్టీల ముచ్చట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం రూరల్ వేమగిరిలో సోమవారం జరిగిన ప్రజాగళం సభలో మూడు పార్టీల ముచ్చట్లు కనిపించాయి. ప్రధాని నరేంద్రమోదీ రాక ముందే వేదిక గోదావరి జిల్లాలో పార్లమెంట్ అభ్యర్థులు, ఎమ్మెల్యేల అభ్యర్థులు, టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆశీనులయ్యారు. పవన్‌కల్యాణ్ పక్కన బీజేపీ మాజీ అధ్యక్షుడు వీర్రాజు కూర్చున్నారు. పవన్ వేదిక మీదకురాగా అభివాదాలు చేసుకున్నారేకానీ తర్వాత వీరు మాట్లాడుకున్నట్టు లేదు. బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, నారా లోకేశ్ పక్కపక్కనే కూర్చున్నారు. పురందేశ్వరి, నారా లోకేశ్ తల్లి భువనేశ్వరి సొంత అక్కాచెల్లెళ్లు అన్న సంగతి తెలిసిందే. లోకేశ్ ఆమెకు కొడుకు అవుతారు. కానీ వీరిద్దరి పార్టీలు వేరు. ఇవాళ పొత్తు వల్ల ఒకే వేదిక మీద కూర్చునే అవకాశం లభించింది. దీనితో కాసేపు ఇద్దరూ ఏవేవో మాట్లాడుకోవడాన్ని సభలోని వారూ ఆసక్తిగా గమనించారు. మరోపక్క గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కందుల దుర్గేష్, బత్తుల బలరామకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్నారు. తర్వాత గోరంట్ల, పవన్ వద్దకు కూడా వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. గోరంట్ల, కందుల నవ్వుతూ మాట్లాడుకోవడం కనిపించింది. ముందు లోకేశ్, తర్వాత పవన్ వేదిక మీదకు రాగానే అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. మోదీ రాగా అందరూ అభివాదం చేశారు. అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పురందేశ్వరి మోదీకి పరిచయం చేశారు. ఆయన భుజం తట్టి అభినందించారు. ఇంకా వేదిక మీద ఆదిరెడ్డి వాసు, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీవేమా, బీజేపీ నేత కాశీవిశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు. ఇక వేదిక మీద టీడీపీ, జనసేన, బీజేపీ కండువాలతో నాయకుల మధ్య ఐక్యత కనిపించింది. వేదిక ముందు జనం చేతుల్లో కూడా మూడు పార్టీల జెండాలు రెపరెపలాడాయి. బొమ్మూరు నుంచి వేమగిరి వరకూ హైవే నిండా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి.



లోకేశ్‌తో హరీష్, ముప్పిడి, ఆదిరెడ్డి



లోకేశ్‌తో బత్తుల



ఉదయ్‌శ్రీనివాస్, హరీష్‌మాధుర్

జగన్ పాలనలో అన్ని వర్గాలకు దగా

రాజమహేంద్రవరం రూరల్ టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: అన్నివర్గాల ప్రజలను జగన్ దగా చేశాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ప్రజల్ని నమ్మించి మోసం చేశాడని.. అరాచక, దోపిడీ పాలనతో ప్రజలు విసుగుచెంది ఉన్నారని చెప్పారు. సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్న బహిరంగ సభలో బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్రం బాగా వెనుకబడి ఉందని, ఇటువంటి తరుణంలో కేంద్ర సహకారం కావాలన్నారు. అందుకే కూటమిని గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కూటమి ద్వారానే సాధ్యమన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. గత ఐదేళ్లుగా జగన్ పరిపాలన దోపిడీలు అక్రమాలు అరాచకాలతో సాగిందన్నారు. ప్రజలకు న్యాయం జరగలేదన్నారు. రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ మోదీ, పవన్‌కల్యాణ్, చంద్రబాబుల కలయిక రాష్ట్ర భవిష్యత్తుకు మంచిదన్నారు. కూటమి విజయం సాధిస్తుందని, ప్రజలు జగన్‌ను సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నా, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా, పేదరికం నిర్మూలించాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న సమయంలో 23వేల మంది భారత్‌కు చెందిన విద్యార్థులు చిక్కుకున్నారని వారికోసం ప్రధాని మోదీ.. ఇరు దేశాధినేతలకు ఫోన్‌చేసి ఆరు గంటలపాటు యుద్ధాన్ని ఆపించి మన విద్యార్థులను దేశానికి తరలించారని, అది మోదీ సత్తా అని గుర్తుచేశారు. అటువంటి నేత మూడోసారి ప్రధాని అయితే దేశం ఇంకా వేగంగా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వికసిత్ భారత్ ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. నరసాపురం ఎంపీ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ మాట్లాడుతూ కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్‌డీఏ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను జగన్ నాశనం చేశాడన్నారు. ప్రపంచలోనే 5వ ఆర్థికశక్తిగా భారత్‌ను తీర్చిదిద్దిన ఘనత మోదీకి దక్కుతుందన్నారు.



వేదికపై లోకేశ్, పవన్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఉపాధ్యాయులే టార్గెట్

పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు గందరగోళం

కాజులూరు ఉపాధ్యాయులకు అమలాపురంలో

టీచర్ల ఓట్లు చెల్లాచెదురు



కాకినాడ పీఆర్ కళాశాలలో ఓట్లు పరిశీలిస్తున్న టీచర్లు

కలెక్టరేట్(కాకినాడ), మే 6: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను టార్గెట్ చేసినట్లు కనిపిస్తోంది. ఉపాధ్యాయుల ఓట్లను చెల్లాచెదురు చేసింది. కాజులూరు మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లు కాకినాడలో కాకుండా అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇతర ఉద్యోగుల తరహాలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఓటు వేద్దామని వచ్చిన కాజులూరు ఉపాధ్యాయులకు సోమవారం నిరాశ ఎదురైంది. ఓటర్ల జాబితాలో ఓట్లు లేవని ఎన్నికల అధికారులు చెప్పడంతో ఖంగుతిన్నారు. కాజులూరు మండలంలో పనిచేస్తున్న తమకు రామచంద్రపురంలో గాని, నివాసం ఉంటున్న కాకినాడలో గాని ఓటు వేసే అవకాశం ఉండాలన్నారు. వింతగా అమలాపురంలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలని ఆదేశించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైతే ఉద్యోగులు ఎన్నికల విధులపై శిక్షణ తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేశారో దాన్ని అనుసరించి ఓట్లు వివిధ ప్రాంతాలలో కేంద్రాలకు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధ్యాయులపై ఉన్న కక్ష నేపథ్యంలో ప్రభుత్వం ఓట్లు చెల్లాచెదురు చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓటుకు రూ.5వేలు

ప్రభుత్వ ఉద్యోగులకు ఓటుకు రూ.5 వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతుంది. జిల్లాల్లో అర్బన్ ప్రాంతంలో ఓటుకు రూ.5వేలు ఇతర ప్రాంతాలలో రూ.3వేలు వైసీపీ నాయకులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సెంటిమెంట్ ఆలయం

- రాజకీయ నాయకులకు నేమాం ఆలయం అంటే ఓ నమ్మకం
- నామినేషన్ దగ్గర నుంచి ప్రచారం వరకు ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాతే ఏదైనా..
- లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగికి కూడా ఈ ఆలయం ఓ సెంటిమెంట్

సర్పవరం జంక్షన్, మే 6: కాకినాడ రూరల్ మండలం ఈశాన్యం దిక్కులో ఉన్న గ్రామం నేమాం. ఈ గ్రామం తీరప్రాంతానికి సమీపంలో ఉంటుంది. ఈ గ్రామంలో శ్రీపర్వత వర్ధినీసమేత శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం చాలా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా రాజకీయ నాయకులకు సెంటిమెంట్ ఆలయం ఇది. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, ముఖ్యంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు తప్పనిసరిగా నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శిస్తారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరమే నామినేషన్ వేసేందుకు వెళతారు. ఎన్నికల ప్రచారం కూడా ఇక్కడ నుంచే లాంఛనంగా ప్రారంభిస్తారు. శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని రాజకీయ నాయకుల నమ్మకం.





పూజలు నిర్వహిస్తున్న పంతం నానాజీ (ఫైల్)

బాలయోగికి ఎంతో నమ్మకం

లోక్‌సభ మాజీ స్పీకర్ బాలయోగి రాజకీయంలోకి ప్రవేశించే ముందు కాకినాడ రూరల్ మండలానికి ఈశాన్య దిక్కులో ఉన్న నేమాం వచ్చి శ్రీ ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ఎన్నికలు జరిగిన ప్రతీసారి నేమాం వచ్చి బాలయోగి పూజలు చేసిన తర్వాతే నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల ప్రచారం నిర్వహించడం అలవాటుగా మారింది. జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికల బరిలోకి దిగిన తర్వాత ఎస్ఆర్ఎంటీ చౌదరి వెంట వచ్చి స్వామివారిని దర్శించుకున్న తర్వాతే నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించడం, జడ్పీ ఛైర్మన్‌గా రాజకీయ ప్రస్థానం కొనసాగించడం చకచకా జరిగిపోయాయి. అక్కడ నుంచి ఎమ్మెల్యే, ఎంపీగా, లోక్‌సభ స్పీకర్‌గా రాజకీయాల్లో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. అప్పటి నుంచి రాజకీయ నాయకుల దృష్టి నేమాం గ్రామంపై పడింది. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్యేలు పిల్లి అనంతలక్ష్మి, తిరుమాని సత్యలింగనాయకర్, అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వరకు ఎన్నికల్లో పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే వారు సైతం ఈ ఆలయాన్ని దర్శించుకుంటారు. నామినేషన్ వేసే ముందు, నామినేషన్ వేసిన తర్వాత, ఎన్నికల ప్రచారం ప్రారంభించే ముందు ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు.

ఓటేయడానికి లండన్ నుంచి..



లండన్ నుంచి వచ్చిన యువకులు

నిడదవోలు, మే 6: ఆ యువకులు ఇద్దరూ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఎక్కడున్నా సొంత గ్రామం, సొంత రాష్ట్రం అంటే విపరీతమైన అభిమానం. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు లండన్ నుంచి స్వగ్రామం నిడదవోలు మండలం శెట్టిపేట చేరుకున్నారు. ఈ ఇద్దరిలో ఒకరైన గంధం లోకేష్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గాన్ని ఎవరు అభివృద్ధి చేయగలుగుతారో వారికే ఓటు వేయాలన్నారు. నిడదవోలు అభివృద్ధికి మేము సైతం అంటూ ఓటు హక్కును వినియో గించుకునేందుకే లండన్ నుంచి వచ్చామని తెలిపారు.

అభ్యర్థుల హైటెక్ ప్రచారం



ఈ సారి ఎన్నికల ప్రచారం హైటెక్‌గా సాగుతోంది. ప్రచారాలను పార్టీలు పూర్తిగా మార్చేశాయి. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ చంద్రబాబు హయాంలో జరిగిన ప్రగతిని వివరిస్తూ ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రచారం చేస్తున్నారు. అంతేగాక ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసుకుని మాధ్యమాల ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు పెట్టి అభ్యర్థుల ప్రచారాలను స్మార్ట్‌ఫోన్లలో పంపిస్తున్నారు.

- ఆత్రేయపురం

ఎన్నికల బందోబస్తుకు రాజస్థాన్ బలగాలు



రాజస్థాన్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలు

పిఠాపురం, మే 6: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలకు రాజస్థాన్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తుకు వచ్చాయి. మన రాష్ట్రంలో మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు రాష్ట్రంలో ఉన్న పోలీసు బలగాలు సరిపోవు. దీంతో ఎన్నికలు పూర్తయిన రాష్ట్రాల నుంచి పోలీసు బలగాలను రప్పించి ఇక్కడ బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజస్థాన్‌కు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలు కాకినాడ జిల్లాకు చేరుకున్నాయి. అందులో మూడు ప్లాటూన్ల రాజస్థాన్ స్పెషల్ పోలీసులను పిఠాపురం నియోజకవర్గానికి కేటాయించారు. ఈ మూడు ప్లాటూన్లలో 240 మంది సిబ్బంది ఉంటారు. వారు సోమవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో కవాతు నిర్వహించి గ్రామంలో బందోబస్తు పర్యవేక్షణకు వచ్చారు.

ఆపరేషన్ ఆకర్ష్ ట్రెండ్!

- ఆ పార్టీ వాళ్లు ఈ పార్టీలోకి.. ఈ పార్టీ వాళ్లు ఆ పార్టీలోకి జంప్
- ప్రచారానికి నేతలు వచ్చే ముందు రోజు వీధుల్లో మందు పార్టీలు

ఉప్పలగుప్తం, మే 5: ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వినూత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం చూస్తుంటాం. అవతలి పార్టీ వారిని తమ వైపు ఆకర్షించేందుకు ఇప్పటికే ఆకర్ష్ పథకం అమలులో ఉన్న సంగతి తెలిసిందే. కాగా 2024 ఎన్నికల్లో కొత్తగా 'ఆకర్ష్ ఆర్భాట్' పథకం పురుడుపోసుకుంది. దీని అమలుకు అన్ని రాజకీయ పార్టీలు పోటీపడుతున్నాయి. ఈ ఆకర్ష్ ఆర్భాటం ఏమిటని సందేహం వచ్చింది కదా! ఈ పథకం ఎన్నికల ప్రచార సమయంలో మాత్రమే ఆయా గ్రామాల్లో అమలులో ఉంటుంది. పోటీలో ఉన్న పార్టీల అభ్యర్థులకు ప్రచార షెడ్యూల్ ఉంటుంది. తాము ప్రచారానికి వెళ్లే గ్రామంలో రెండు రోజులు ముందుగానే సదరు పార్టీ కీలక నేతలు ఆ గ్రామంలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు రాత్రి సమయాల్లో మందు పార్టీలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా పలు ప్రలోభాల వలలు విసురుతారు. ఈ ప్రయత్నంలో కనీసం కొందరైనా ప్రభావితులవుతారు కదా! అయితే ఇక్కడ మరో సరికొత్త ఆకర్ష్‌కు తెర తీశారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన గ్రామ కమిటీ, మండల కమిటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ పదవుల్లో ఉన్న వారు లేదా మాజీలను ప్రధానంగా ఎంచుకుంటున్నారు. ప్రచారం రోజున భారీ ఆర్భాటంతో ఆకర్షితులకు తమ పార్టీ కండువాలు వేస్తారు. వారిని తీసుకుని ఆ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తారు. దీని ప్రత్యేకత ఏమిటంటే ప్రత్యర్థి పార్టీల ముఖ్యులు తమవైపు ఆకర్షితులవుతున్నారని ఓటర్లను నమ్మించడం. ప్రత్యర్థులు బలహీనపడుతున్నారన్న సంకేతాలను జనంలోకి పంపడమన్నమాట. ఈ పథకాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జోరుగా అమలు చెయ్యడం రోజూ చూస్తున్నాం కదా!!

కొత్తపల్లి కొబ్బరి రేటు పైపైకి



కొత్తపల్లి, మే 6: మామిడి పండ్లలో రారాజు కొత్తపల్లి కొబ్బరి. ఎంతరేటుకైనా సంవత్సరానికి ఒక్కసారైన కొనుక్కొని తినాలనిపించే అమృతఫలం లాంటి మామిడి పండు కొబ్బరి మామిడి అని అంటుంటారు. ఈ ఏడాది కొబ్బరి మామిడి చెట్లు పూత ఆశాజనకంగా ఉన్నప్పటికీ కాయలుగా మార్పు చెందే క్రమంలో మంచు దెబ్బకు పూత పూర్తిగా మాడిపోవడంతో మామిడి కాయల కాపు తగ్గింది. దీంతో అక్కడక్కడ ఉన్న పూతలతో కాసిన కాయలను పండ్లు తయారు చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. పచ్చికొబ్బరి మామిడి కాయలతో ఈ సీజన్లో అవకాయ పెట్టి కొత్తగా పెళ్లయిన వారి అత్తారింటికి పంపడం స్టేటస్‌గా భావిస్తారు. పచ్చడికి పెట్టేందుకు 100 పచ్చికొబ్బరి మామిడి కాయలు రూ.6 నుంచి 7వేల వరకు రేటు పలుకుతుంది. అదే విధంగా కొబ్బరి మామిడి పండ్లు పరక అంటే 14 కాయలు రేటు రూ.750 వరకు ఉంటుంది. అయినప్పటికీ మార్కెట్లో ఎక్కడా కొబ్బరి మామిడిపండ్లు దొరకకపోవడంతో దొరికిన పండ్లను చెప్పిన రేటుకు ఎగరేసుకొని పోవడం గమనార్హం.

పట్టాలు తప్పిన గూడ్స్



రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. పారాదీప్ నుంచి బళ్లారి ఎరువుల లోడుతో వెళుతున్న గూడ్స్ రైలు సోమవారం ఉదయం 6.30కు రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాంకు చేరుకుంటున్న సమయంలో ఓ బోగీ రెండు చక్రాలు పట్టాలు తప్పాయి. స్టేషన్ కావడంతో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టాలు తప్పిన బోగీని వేరుచేసి రైలును పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు


యజ్జల పంపాదమ్మ

పిఠాపురం, మే 6: పిఠాపురంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మరణించగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తొండంగి మండలం ఎర్రయ్యపేట పంచాయతీ వి.కొత్తకోట గ్రామానికి చెందిన యజ్జల అప్పారావు, పంపాదమ్మ (55)లు పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీ సమీపంలోని వైభవ్ వెంచర్స్‌లో నివాసముంటున్నారు. వారు పిఠాపురం నుంచి కోనపాపపేట వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. ఉప్పాడ బస్టాండ్ వద్దకు వచ్చేసరికి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో పంపాదమ్మ మరణించగా, భర్త అప్పారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమయిన లారీ డ్రైవర్ దురుసుగా ప్రవర్తించడంతో పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ప్రమాదం విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన కుమారులు బాబ్జి, రమణలు తల్లి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా పంపాదమ్మకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ మూకల దాడి దారుణం

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


నల్లల శ్రీధర్‌ను పరామర్శిస్తున్న వేములపాటి అజయ్‌కుమార్


తాటిపర్తిలో మోహరించిన పోలీసు బలగాలు

పిఠాపురం, మే 6: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్ తేజ్‌పై వైసీపీ రౌడీమూకలు దాడి చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. వైసీపీ మూకలు విసిరిన గాజు ముక్కలు తగిలి స్థానిక జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలు కావడం చాలా బాధాకరమని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నామని చెప్పారు. జనసేన ర్యాలీ సందర్భంగా వైసీపీ రౌడీలు ఘర్షణ వాతావరణం సృష్టించి జనసైనికులను భయాందోళనలకు గురిచేసేందుకు రాళ్లు, గాజు సీసాలు విసిరే ప్రయత్నం చేశారని చెప్పారు. వైసీపీ జెండాలు ప్రదర్శిస్తూ జనసైనికులపై కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నా పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ మార్కు రౌడీయుజంతో బెదిరించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు భయాందోళనలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ అధికారులు కోరుతున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీధర్‌ను జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ పరామర్శించారు. సంఘటన గురించి తెలుసుకున్నారు.

పోలీసు బలగాల మోహరింపు

గొల్లప్రోలు రూరల్, మే 6: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పోలీసు బలగాలను మోహరించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహిస్తున్న మెగా హీరో సాయిధరమ్‌తేజపై వైసీపీ శ్రేణులు డ్రింక్‌బాటిల్ విసిరి దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఆయన త్రుటిలో తప్పుకున్నారు. అయితే ఆ గాజు సీసా తగిలి జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో జనసేన, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో మూడు బెటాలియన్ల పోలీసు బలగాలను సోమవారం మోహరించారు. గ్రామంలో కవాతు నిర్వహించారు. ఇక్కడ ప్రత్యేకంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పరిస్థితిని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

ఇద్దరు వైసీపీ నేతల అరెస్టు

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం రాత్రి డ్రింక్‌బాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో పాటు జనసైనికుడు నల్లల శ్రీధర్‌కు తీవ్ర గాయాలయిన సంఘటనకు సంబంధించి వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఉంగరాల వీరబాబు, ఆ పార్టీ నాయకుడు వెంకటరమణలను గొల్లప్రోలు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి పోలీసులు ముందుగా విచారణకు పిలిచారు. వైసీపీ నేతలు ఇరువురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. అంతకు ముందు జరిగిన సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు సంఘటన వివరాలను అక్కడ ఉన్న వారి నుంచి సేకరించారు. కాగా డ్రింక్‌బాటిల్‌తో దాడి సంఘటనలో తీవ్రంగా గాయపడిన నల్లల శ్రీధర్‌ను మెగా హీరో సాయిధరమ్ తేజ్ చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో పరామర్శించారు.

సాయిధరమ్‌తేజ్‌పై దాడి అవాస్తవం

ఎస్‌డీపీవో హనుమంతరావు

కాకినాడ క్రైం, మే 6: సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌పై దాడి జరిగిందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అంశం అవాస్తవమని కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) కె.హనుమంతరావు పేర్కొన్నారు. కాకినాడలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్‌డీపీవో ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జనసేన పార్టీకి మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ఎన్నికల ప్రచారం (రోడ్‌షో) ఆదివారం గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తిలో రోడ్‌షో జరుగుతుండగా ఎవరో ఆగంతకులు గాజు బాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో అతనికి ప్రమాదం తప్పి పక్కనే ఉన్న నల్ల శ్రీధర్ అనే వ్యక్తికి గాయమైనట్లు సామాజిక ప్రచార మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. వెంటనే అప్రమత్తమైన జిల్లా పోలీస్ శాఖ యుద్ధ ప్రాతిపదికన విచారణ చేపట్టినట్లు ఎస్‌డీపీవో వెల్లడించారు. అయితే సాయిధరమ్‌తేజ్ రోడ్‌షో నుంచి వెళ్లిపోయిన పావుగంట తర్వాత ఈ సంఘటన జరిగినట్లు అక్కడ గాజుబాటిల్ ఆనవాళ్లు కూడా లేనట్లు శ్రీధర్‌కు రాయి తగిలినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు ఎస్‌డీపీవో స్పష్టం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సత్యదేవుడి ఆలయానికి రంగులు

అన్నవరం, మే 6: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి దివ్యకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో రంగులు వేసే కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా రామాలయానికి మాత్రమే రంగులు వేయగా సత్యదేవుడి బ్రహ్మోత్సవాలకు ఆలయంలో అన్ని వ్రతమండపాలు, తూర్పుపశ్చిమ రాజగోపురంలకు రంగులు వేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈఏడాది స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు అంగరంగవైభవంగా చేపట్టేందుకు ఇప్పటికే శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించగా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సత్యదేవుడి కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి 24 వరకు జరగనున్నాయి. గతేడాది తీసుకొచ్చిన సంప్రదాయాలను పక్కనబెట్టి పూర్వపు సంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. గతేడాది స్వామివారి కల్యాణ తలంబ్రాలను గోటితో ఒలిచినవి వినియోగించగా అన్నవరం ఆలయానికి అటువంటి సంప్రదాయం లేదని బియ్యపు అక్షింతలు వినియోగించనున్నారు. అదే విధంగా శ్రీపుష్పయోగం గతేడాది ఆరుబయట వార్షిక కల్యాణవేదికపై చేపట్టగా వైదిక కమిటీ సూచనతో ఈ ఏడాది పూర్వపు పద్ధతిలో అనివేటి మండపంలో చేపట్టాలని నిర్ణయించారు.

దుర్గాడలో నక్షత్ర భస్మాభిషేకం



గొల్లప్రోలు, మే 6: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో నక్షత్ర భస్మాభిషేకం నిర్వహించారు. సోమవారం మాసశివరాత్రి సందర్భంగా ఆలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాగణపతిపూజ, మహాన్యాస పారాయణ, 27 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. 27 కిలోల విభూది, 27 నక్షత్రాల పూర్వక భస్మాభిషేకం నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మొబైల్ నుంచే
ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

అమలాపురం టౌన్, మే 6: పదో తరగతి, ఆపైన విద్యార్హత కలిగిన వారంతా తమ మొబైల్ నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జిల్లా ఉపాధి అధికారిణి యు.వసంతలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జిల్లా ఉపాధి కార్యాలయానికి రాకుండానే వారి ఇల్లు, స్వస్థలాల నుంచి ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు విద్యార్హతలు నమోదు చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ రూపొందించామన్నారు. విద్యావంతులు మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ సిస్టమ్ ద్వారా వెబ్‌పోర్టల్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న తర్వాత జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆ దరఖాస్తులను పరిశీలించి ఆమోదం తెలిపిన వెంటనే వారి మొబైల్‌కు సమాచారం అందుతుంది. సమాచారం అందిన తర్వాత దరఖాస్తుదారులు ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించే జాబ్ మేళాల సమాచారం తెలుస్తుంది. ఇతర వివరాల కోసం 8121838392 నెంబరును సంప్రదించాలి.

నేడు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే 6: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రధానపార్టీలు బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నాయి. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో రోడ్‌షో నిర్వహించనున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ రోడ్డులో సీఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు రోడ్‌షో నిర్వహించారు. ఇప్పుడు కూడా సరిగ్గా అదే ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. రాజానగరం నియోజకవర్గం నుంచి ప్రజలను సమీకరించడానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. గ్రామాల వారీ జన సమీకరణ చేపట్టారు.

జిల్లాలో 1577 పోలింగ్ కేంద్రాల పరిధిలో

మైక్రో అబ్జర్వర్స్‌కు ఎన్నికల బాధ్యతలు



- నేడు ఆనం కళాకేంద్రంలో మైక్రో అబ్జర్వర్స్ శిక్షణా కార్యక్రమం: కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం కల్చరల్ మే 6: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 1577 పోలింగ్ కేంద్రాల పరిధిలో 342 మంది మైక్రో అబ్జర్వర్స్ ఎన్నికలలో బాధ్యతలు నిర్వహించనున్నారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్స్ నేరుగా ఎన్నికల సాధారణ పరిశీలకులుగా జవాబుదారీతనం కలిగి ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలవద్ద మౌలిక సదుపాయాలు, పోలింగ్ రోజున పోలింగ్ నిర్వహణా వ్యవస్థ తదితర అంశాలపై జిల్లాకు వచ్చిన ఇద్దరు సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోచ్ స్వయంగా శిక్షణ అందిస్తారని, అవగాహన కల్పిస్తారని తెలిపారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం ఉదయం శిక్షణా కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం హాజరైన మైక్రో అబ్జర్వర్స్, స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సూక్ష్మ పరిశీలకుడు ఎప్పటికప్పుడు సాధారణ పరిశీలకులు నేరుగా నివేదికలను నివేదించాలని, పోలింగ్ బూత్ స్థితి, తదితర అంశాలపై పోలింగ్ ఏజెంట్లు, ఓటర్లు చేసిన ఫిర్యాదులను గమనించి, ఫిర్యాదుల తీవ్రత, స్వభావాన్ని అర్థం చేసుకునే కీలక బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవోల పాత్ర కీలకం

- ఎన్నికల పరిశీలకుడు సుబ్రహ్మణ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు సుబ్రహ్మణ్యం

దివాన్‌చెరువు, మే6: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకోవడం పీవోలు, ఏపీవోలు పాత్ర కీలకమైందని సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.సుబ్రహ్మణ్యం అన్నారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పీవో, ఏపీలకు రెండవ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆర్వో చైత్రవర్షిణితో కలిసి పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు నిర్వర్తించే పాత్ర కీలకమన్నారు. ఒకటికి రెండు సార్లు పునశ్చరణ చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం మన అందరిపై ఉన్న వ్యక్తిగత బాధ్యత అన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా స్వీప్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణా కార్యక్రమం పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీవో బుక్‌లో పేర్కొన్న విధంగా ఎన్నికల విధులు నిర్వహించే క్రమంలో నిబద్ధత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈసందర్భంగా ఆర్వో చైత్రవర్షిణి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమానికి హాజరైన వారంతా తప్పని సరిగా తాము నిర్వహించాల్సిన బాధ్యత, అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

రంగంపేట చెక్‌పోస్ట్ వద్ద

రూ.2.71 కోట్లు పట్టివేత.. విడుదల



రంగంపేట, మే 6: రంగంపేట మండలం రామేశంపేట వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద సోమవారం ఉదయం 11.15 గంటలకు విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 2.71 కోట్ల రూపాయలు తరలిస్తున్నట్లు కనుగొని వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమాచారం అందుకున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ మ్యాజిస్ట్రేట్ పి.వెంకటరత్నం ఘటనా స్థలానికి చేరుకొని చెక్‌పోస్టు వాహన సిబ్బందిని విచారణ చేయగా సిబ్బందివారి వద్ద ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చెస్ట్ విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం బ్రాంచ్‌కి 2.71 కోట్ల రూపాయలు క్యాష్ ట్రాన్స్‌ఫార్మర్ ఓచర్, ఈసీఐ (భారత ఎన్నికల కమిషన్) చే జారీ చేసిన యూనిక్ ఐడీ పత్రాన్ని చూపించారు. సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు బ్యాంక్ వారితో సంప్రదించి, ఎలక్షన్ సీజరు మేనేజ్‌మెంట్ సిస్టమ్ వెబ్‌సైట్‌లో సరిచూసుకొని స్థానిక ఎస్‌హెచ్‌వో, ఎఈవో, ఫ్లయింగ్ స్క్వాడ్ జిల్లా నోడల్ అధికారి వారితో సంప్రదించి సదరు 2.71 కోట్ల సొమ్మును విడుదల చేశామని ఫ్లయింగ్‌స్క్వాడ్ మ్యాజిస్ట్రేట్ పి.వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వి.త్రినాథ్‌రావు, పోలీస్ కానిస్టేబుల్ జి.వి.ఎస్.ఎస్.రెడ్డి, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE
నిడదవోలు, గాంధీనగర్, లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సీ నందు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ E/F అమ్మకమునకు కలదు. 25L Negotiable Contact no : 9441037735.
Ajd:177183

స్థలం అమ్మకం
RJY సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రక్కన E/F సుమారు 82.5 చ.గ. గల స్థలం అమ్మకమునకు గలదు. సెల్: 8790797045
AJD :6698

4 Lines CLASSIFIED Rs.230/- Only

అనపర్తిలో జబర్దస్త్ టీమ్ ప్రచారం


కొప్పవరంలో ప్రచారం నిర్వహిస్తున్న జబర్దస్త్ నటులతో నల్లమిల్లి

అనపర్తి, మే 6 : అనపర్తి ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పార్లమెంట్ అభ్యర్థిని పురందేశ్వరిల విజయాన్ని కాంక్షిస్తూ ఈటీవీ జబర్దస్త్ టీమ్ సోమవారం అనపర్తి మండలంలో పర్యటించారు. పటాస్ ప్రవీణ్, షబీనా, హరికృష్ణలు అనపర్తి మండలం కుతుకులూరు, కొప్పవరం, పొలమూరు గ్రామాల్లో తమదైన రీతిలో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో చైతన్య రథంపై వారు పర్యటిస్తూ నల్లమిల్లి, పురందేశ్వరిలను గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. తమ కోసం ప్రచారం నిర్వహిస్తున్న జబర్దస్త్ నటులకు నల్లమిల్లి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు రైతాంగానికి మేలు

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు


కొవ్వూరు ఎన్నికల ప్రచారంలో గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 6: రైతాంగానికి మేలు జరగాలంటే ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి గిడుగు రుద్రరాజు కోరారు. సోమవారం కొవ్వూరులో ఆయన, ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి 9 గ్యారెంటీల కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం పంటకు గిట్టుబాటు ధరలు రావాలంటే కాంగ్రెస్ రావాలన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ వల్లనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో తనకు, అరుణకుమారికి హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం రాజమహేంద్రవరంలో సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్‌లో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాని కోరారు.

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం, సూర్యనారాయణపురం, కృష్ణంపాలెం, ధూమంతనగూడెం, కొత్తగూడెం, రామన్నపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మార్టిన్‌లూథర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జ్యేష్ఠ సతీష్, వెలగా రామకృష్ణ, కాకర్ల శ్రీహరిబాబు, చైతన్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీ ఆశీస్సులతో భారీ విజయం సాధిస్తాం

- అనపర్తి ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


నల్లమిల్లి కుమార్తె డాక్టర్ సనాతనిని సత్కరిస్తున్న ముస్లింలు


రాజమహేంద్రవరం సభలో నల్లమిల్లిని భుజం తట్టి ఆశీర్వదిస్తున్న ప్రధాని మోదీ

అనపర్తి, మే 6: భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తాను భారీ విజయం సాధిస్తామని అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో జరిగిన ప్రధాని బహిరంగ సభలో పురందేశ్వరి పరిచయం చేయగా ప్రధాని తనను ఆప్యాయంగా పలుకరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనపర్తి బీజేపీ అభ్యర్థిని అని తెలియడంతో భుజంతట్టి అభినందించారు. అనపర్తిఅసెంబ్లీతో పాటు రాజమహేంద్రవరం ఎంపీ స్థానాలలో విజయం సాధించి ప్రధానికి బహుమతిగా అందిస్తామన్నారు.

అనపర్తిలో నల్లమిల్లి ప్రచారం


కొప్పవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణారెడ్డి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం అనపర్తిలో పర్యటించి ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. అనపర్తిలోని జీబీఆర్ వాకర్స్ క్లబ్‌లో వాకర్స్‌ను కలుసుకుని వచ్చే ఎన్నికలలో తనకు మద్దతు తెలపాలని కోరారు. అనపర్తి, పొలమూరు, చినపొలమూరు గ్రామాలలో ఉపాధి హామీ కూలీలను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. కొప్పవరంలో ఇంటింటా ప్రచారం నిర్వహించిన నల్లమిల్లి తనకు కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

అనపర్తిలో నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ సనాతని ప్రచారం

ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోరుతూ అనపర్తి ధరణికోటలో నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి కుమార్తె డాక్టర్ సనాతని ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ నల్లమిల్లికి విజయం చేకూర్చాలని ప్రచారం నిర్వహించారు. మహాలక్ష్మి అనపర్తిలోని తేతలి రామిరెడ్డి మంగయమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులను కలుసుకుని వారితో ముచ్చటిస్తూ కమలం గుర్తుపై ఓట్లు వేసి నల్లమిల్లి, పురందేశ్వరిలకు విజయం చేకూర్చాలని కోరారు. పులగుర్త గ్రామంలో కూడా తల్లి కూతుళ్ల ఇంటింటా ప్రచారం నిర్వహించారు

పందలపాకలో నల్లమిల్లి తనయుడి ప్రచారం


అనపర్తిలో వృద్ధాశ్రమంలో ముచ్చటిస్తున్న నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి

బిక్కవోలు మండలం పందలపాకలో ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోరుతూ ఆయన తనయుడు మనోజ్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు.

రంగంపేట: మండలంలో దొడ్డిగుంటలో మాజీ సర్పంచ్, పలువురు వైసీపీ నాయకులు అనపర్తి నియోజకవర్గం ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బీజేపీలో చేరారు. వైసీపీ ఎస్సీ నాయకులు వార అమృతప్రసాద్, వార వసంతరావు, ఇజ్జిన జార్జీ, వార పండుబాబు, సిద్దాబత్తుల అప్పారావు, విత్తనాల బూరయ్య, కొండేపూడి రాజారావు, కస్తూరి ప్రకాశ్, కారి యేసు, కారి గంగరాజు, కారి వెంకన్న, పైడిమళ్ళ నాగేశ్వరరావు, అలపు అబ్బులు, కల్తూరి ప్రకాశ్‌రావు, పలువురు వైసీపీ నుంచి బీజేపీలో చేరారు. వీరందరికీ రామకృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సారా కేసులో ఒకరికి రిమాండ్

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): నాటుసారా కేసులో ఒక వ్యక్తికి కోర్టు రిమాండు విధించింది. సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా.ఎస్.నిక్సన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో స్టేషను పరిధిలో విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 9 మందిని అరెస్టుచేసి 73 లీటర్లు, 58 మద్యం సీసాలు, 20లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారాతో పట్టుబడిన నడిపల్లి రాముకు కోర్టు రిమాండు విధించిందని నిక్సన్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

కూటమి అభ్యర్థులను గెలిపించాలి



వీరాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థులు

వరరామచంద్రాపురం, మే 6: రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతోపాటు అభివృద్ధి జరగాలంటే ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని మండల కూటమి నాయకులు కోరారు. సోమవారం మండల కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వీరాపురం, మండల కేంద్రంలో జరిగిన వారాంతపు సంతలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, మండల అధ్యక్షుడు ఆవంటి శ్రీను, నాయకులు ముత్యాల రామారావు, బొర్ర నరసింహారావు, ముత్యాల నరేష్, ముత్యాల సిద్ధు, సూరి, బొర్ర ఆదినారాయణ, పొడియం రాజు, జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయి కృష్ణ, అంజి, సాయి, బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు పాయం వెంకయ్య, కడుపు వెంకటరమణ, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

కూనవరం, మే 6: మండలంలోని బిగన్నపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సుమారు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా టీడీపీ మండల కార్యదర్శి, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో ఆకర్షితులై వందలాది మంది కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారన్నారు. అందులో భాగంగానే బిగన్నపల్లి నుంచి గిరిజన కుటుంబాలని పార్టీలో చేర్చుకున్నారు. టీడీపీ ఆరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, చలకాని ఉమామహేశ్వరరావు, సోమక సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

కూటమితోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి

మోతుగూడెం, మే6: మోతుగూడెంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతం అభివృద్ధి సాధ్యపడుతుందని మోతుగూడెం టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అన్నారు. టీడీపీ మండల నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు, నర్సింహారావు కలిసి పొల్లూరు, మోతుగూడెం చుట్టుపక్కల గ్రామాలను సోమవారం పర్యటించారు. చింతూరు మండల నాయకులు మల్లెల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిశూన్యమన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే స్థానంలో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు ధారబాబు, వార్డుమెంబర్ ఓలయ్య, భీమరాజు, సాగర్, ప్రసాద్, నాగబాబు,అప్పన్న, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి

ఎటపాక, మే 6: ఈనెల 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ డి రామారావు కోరారు. సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో నెల్లిపాకలో పోలీసు బలగాలతో కవాతు ర్యాలీ నిర్వహించారు. ఓటు వేసే రోజున ఓటర్లు భయంలేకనుండ గురికాకుండా, బలహీనతలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల్లో ఓటును వినియోగించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ కె పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎంతోనే గిరిజన, గిరిజనేతరుల అభివృద్ధి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

రాజవొమ్మంగి మే 6: సీపీఎంతోనే ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతరుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాజవొమ్మంగి సూకాలమ్మ ఆలయం వద్ద సీపీఎం పార్టీ సోమవారం బహిరంగ సభను నిర్వహించింది. ముందుగా రాజవొమ్మంగి గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా సభా ప్రాంగణానికి వెళ్లారు. సీపీఎం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరు, సీపీఎం ఎమ్మెల్యే ఐ.వెంకటేశ్వరరావులు ర్యాలీలో పాల్గొన్నారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యంచేశాయని ఆరోపిస్తూ దుతున్నాయని ఆరోపించారు. సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో రహదారి సౌకర్యాలు లేవని, చెరువులు, చెక్ డ్యాంలు ప్రతిపాదనలు ఉన్న వాటికి రిపేర్లు లేవని రామారావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆలీ, సీపీఎం సర్పంచ్‌లు కొండ సూరిబాబు, కుంజం జగన్నాధం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటికోసం అల్లాడుతున్న మూగజీవాలు

మోతుగూడెం, మే 6: చింతూరు మండలం మోతుగూడెం వేసవిలో మనుషులతో పాటు మూగజీవాలు దాహార్తితో అల్లాడిపోతున్నాయి. మోతుగూడెంలోని రామాలయం సమీపంలో ఉన్న కుళాయివద్ద గోవులు దాహార్తి తీర్చుకుంటూ ఇలా కనిపించాయి.



దాహార్తిని తీర్చుకుంటున్న ఆవుదూడ

దేవాదాయశాఖ భూములు కౌలుహక్కు బహిరంగ వేలం ప్రకటన

కూనవరం మండలం ... గ్రామంలో గల శ్రీ దేవాదాయశాఖ సంస్థల యొక్క భూములను 2024-25 నుండి 2026-27 వరకు మూడు సంవత్సరములకు కౌలుహక్కు బహిరంగ వేలం నిర్వహించబడును. [illegible]

క్ర. సం	సంస్థ పేరు చిరునామా	భూమి సర్వే నెం	విస్తీర్ణం ఎ.సెం	వివరం	తేదీ సమయం	పాట జరుగు ప్రదేశము	పాట నిర్వహించు అధికారి
1	శ్రీ వి.వీరభద్ర స్వామి వారి దేవస్థానం, కోనకొండ	సంద్రాలంక	216.227/1	30-73 3 ప్రకారం	16.05.2024 ఉదయం 10గంటలకు	సంద్రాలంక గ్రామం...	కార్యనిర్వహణాధికారి
		నాదెంపాలెం	291,323	18-32	నుండి 12గం		
		కోరుకొండ	247	20-54	18-6-2024		
			325	6 ప్రకారం	ఉదయం 10గంటలకు		
2	శ్రీ వెల్లీశ్వరస్వామి వారి దేవస్థానం కోరుకొండ	కాపవరం	420	14-79	మ. 12గం		
			421	5 ప్రకారం	లకు		

గమనిక: పూర్తి వివరములకు ... కార్యాలయము నందు సంప్రదించగలరు.

1-05-2024 కార్యనిర్వహణాధికారి కోరుకొండ

కౌలు టెండరు కం బహిరంగ వేలం ప్రకటన

... శ్రీ కృష్ణ స్వామి వారి దేవస్థానము నకు చెందిన భూములను 2024-2025 నుండి 2026-2027 వరకు ... రూ.9.75 ... 17.05.2024 ... బహిరంగ వేలం నిర్వహించబడును. [illegible]

క్ర. సంఖ్య	దేవస్థానము పేరు	భూమి యున్న గ్రామం	రి.స.నెం	విస్తీర్ణం ఎ.సెం
1	శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి దేవస్థానం, బిక్కవోలు గ్రామం & మండలం	పందలపాక గ్రామము బిక్కవోలు మండలం	66	2.00
2			66	2.17
3			187	2.78
4			187	2.80
			మొత్తం	9.75

ముఖ్యషరతులు: [illegible]

బిక్కవోలు, 05.05.2024 A.S.B.G. రామలింగం, కార్యనిర్వహణాధికారి

కూటమి బహిరంగ సభకు విశేష స్పందన

దివాన్‌చెరువు/రాజానగరం, మే 6: వేమగిరిలో జరిగిన కూటమి బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతం నుంచే ప్రజలు బహిరంగ సభకు తరలివెళ్లడం కానవచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్సులు, ఆటోలు, బైకులపై సభకు తరలివచ్చారు. సభా ప్రాంగణానికి చేరుకునేందుకు జాతీయ రహదారిపై ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. విశాఖ, తుని, కాకినాడవైపు నుంచి వచ్చే భారీ వాహనాలను దివాన్‌చెరువులోని జీరో జంక్షన్ వద్ద నుంచి గామన్ బ్రిడ్జి మీదుగా దారి మళ్లించారు. సభకు వెళ్లే బస్సులతో పాటు టాక్సీలు, ఇతర వాహనాలను యథావిధిగా రాకపోకలు సాగించాయి. దూర ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వెళ్లే వారు జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్ల నీడన భోజనాలు ముగించుకుని ముందుకు సాగారు. కొవ్వూరు వైపు నుంచి బహిరంగ సభకు వచ్చే బస్సులను దివాన్‌చెరువు సమీపంలోని జీరో జంక్షన్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకున్నాయి. దివాన్‌చెరువు వైపు నుంచి లాలాచెరువుకు వెళ్లాల్సిన లోడు లారీలను ఉదయం 9 గంటల నుంచే పోలీసులు అనుమతించలేదని దీంతో రోడ్డు పక్కన జీరో జంక్షన్ వద్దనే వాహనాలను నిలిపివేయాల్సి వచ్చిందని వాహనదారులు వాపోయారు.

మీ భూములపై జగన్ పెత్తనమేంటి!

● ప్రజలను మోసం చేసేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్
● రెండేళ్లల్లో పోలవరం పూర్తి
● రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



ప్రజాగళం బహిరంగ సభ వేదికపై మోదీతో ఆదిరెడ్డి శ్రీనివాస్, భవాని



రాజమహేంద్రవరం సిటీ, మే 6: ప్రజలను మోసం చేసేందుకే ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను జగన్ తీసుకువచ్చారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఇప్పటివరకు బీజేపీ రాష్ట్రాలతో సహా ఏ రాష్ట్రంలోను ఈ యాక్ట్ అమలు చేయలేదన్నారు. అటువంటప్పుడు ఈ చట్టం కోసం జగన్‌రెడ్డి ఎందుకు ముందుకువచ్చారని ప్రశ్నించారు. 2023 అక్టోబరు 31 నుంచే ఈచట్టం అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ జీవో నెం 512ను తెచ్చిందని, ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటుచేసి దానికి ఛైర్‌పర్సన్, కమిషనర్, సభ్యులను నియమిస్తూ 2023 డిసెంబరు 29న ఉత్తర్వులిచ్చారన్నారు. ఈ చట్టంపై ప్రజలో తీవ్రవ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల్లో ప్రజల్ని మోసం చేయడానికి ఈ చట్టానికి ఇంకా మార్గదర్శకాలు ఇవ్వలేదని నాటకాలు ఆడుతున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయనటువంటి ఇక్కడ ఈ చట్టం ఎందుకు చేశారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా రూ.లక్షల కోట్లు స్వాహాచేశారని ఆరోపించారు. జగన్‌రెడ్డి బినామీ కంపెనీ ఇండోసోల్ కంపెనీకి ఒక్క రామాయపట్నం పరిసరాల్లో 8500 ఎకరాల రైతుల భూములను కారు చౌకగా కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా జగన్ భూ మాఫియా లక్షలాది ఎకరాలు కబ్జా చేయడానికి తొందర తొందరగా ఈ చట్టం చేశారని జగన్ రెడ్డికి ఓటు వేయడమంటే మన భూ హక్కుల్ని మన ఆస్తి హక్కులపై అధికారాన్ని పూర్తిగా వైసీపీ నాయకులకు కట్టబెట్టడమే అవుతుందన్నారు.

● పోలవరాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తారు

రాష్ట్రానికి జీవనాడిగా ఉన్న పోలవరాన్ని కూటమి అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో పూర్తి చేస్తారని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రాలో భూ మాఫియాను అంతం చేసేందుకు, అమరావతిని మళ్లీ రాజధానిగా ఏర్పాటు చేయడానికి కూటమిగా ఏర్పడ్డామన్నారు. పోలవరానికి జాతీయ హోదా కల్పించడంలో బీజేపీ కీలకపాత్ర పోషించిందన్నారు. జగన్ రెడ్డి అవినీతిలో కూరుకుపోయి ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని అలస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ, చంద్రబాబులు ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తారని చెప్పారు.

● రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టిన చంద్రబాబు

టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టిన విషయాన్ని ఆదిరెడ్డి శ్రీనివాస్ గుర్తుచేశారు. అటువంటి అధికారంలోకి వచ్చిన జగన్ పూర్తిగా నాశనం చేశాడన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఈనెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో రాజమహేంద్రవరం ప్రజలందరూ తనకు సైకిల్ గుర్తుపైన ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

మోదీని ముచ్చటగా మూడోసారి ప్రధాని చేయాలి

● ప్రజాగర్జన సభలో రాజానగరం అసెంబ్లీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ







ప్రజాగళం బహిరంగ సభ వేదికపై బత్తుల బలరామకృష్ణను అభినందిస్తున్న ప్రధాని మోదీ, సభలో మాట్లాడుతున్న బత్తుల, లోకేశ్‌తో బలరామకృష్ణ, ఉండేశ్వరపురంలో ప్రచారం చేస్తున్న బత్తుల వందనాంబిక

కోరుకొండ, మే6: ప్రపంచంలో భారతదేశాన్ని విశ్వ గురువుగా నిలబెట్టిన ప్రధాని నరేంద్రమోదీని ముచ్చటగామూడోసారి ప్రధానిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎన్డీయే కూటమి రాజానగరం అసెంబ్లీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. రాజమండ్రి రూరల్ వేమగిరిలో సోమవారం జరిగిన ప్రజాగళం వేదికపై నుంచి భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో బత్తుల బలరామకృష్ణ చేసిన ప్రసంగం పలువురిని ఆకట్టుకుంది. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్రమోదీని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వేదికపైన కలిసి ఆశీస్సులు అందించుకున్నారు. రాష్ట్ర ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలంటే దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఆదివిధంగా రాష్ట్రంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. నారా లోకేష్‌ను విజనరీ కలిగిన నాయకుడు అన్నారు. ప్రధాని మోదీ, చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పోల్చారు. ఈ ముగ్గురు త్రిమూర్తుల నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. రాజానగరం నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఆయన తనకు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజాగళంవేదికపై నుంచి బత్తుల బలరామకృష్ణ ప్రజలను కోరారు. రాజమహేంద్రవరంపార్లమెంట్ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరిని కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని బలరామకృష్ణ కోరారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజాగళంవేదికపై బలరామకృష్ణను అభినందిస్తూ ఆశీర్వదించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పలు అంశాలు బలరామకృష్ణ చర్చించారు.

● ఉండేశ్వరపురంలో వందనాంబిక ప్రచారం

సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామంలో సోమవారం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె బత్తుల వందనాంబిక గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. 13న జరిగే పోలింగ్‌లో బ్యాలెట్ పేపర్‌లోని 5వ నెంబరులోని గాజుగ్లాసు గుర్తుపై ఓటువేయాలని కోరారు.



పవన్‌కల్యాణ్‌తో ముచ్చటిస్తున్న బత్తుల

● తోట రాజు ప్రచారం

ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి పక్షాన పలువురు నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. సోమవారం రాజానగరం మండలం సూర్యారావుపేటలో కూటమి అభ్యర్థి బలరామకృష్ణను గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బలరామకృష్ణ వియ్యంకులు తోట రాజు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈవీఎం మిషన్‌లో ఓటు వేసే సమయంలో 5వ నెంబరులో బత్తుల బలరామకృష్ణ పేరుపక్కన గాజుగ్లాసుపై బటన్ నొక్కి బలరామకృష్ణను గెలిపించాలంటూ ప్రజలను కోరారు. ఇంటింటికి వెళ్లి ఈవీఎం మిషన్ల మూనా కరపత్రాలు పంపిణీ చేశారు.



సూర్యారావుపేటలో బత్తుల బలరామకృష్ణను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేస్తున్న తోట రాజు

ఎస్సీలకు తీరని అన్యాయం చేసిన జగన్

● ఎమ్మార్పీఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లేటి శ్రీనివాస్

రాజానగరం, మే 6: ఎస్సీ కార్పొరేషన్ నిధులను సొంత ప్రయోజనాలకు వాడుకుని సీఎం జగన్ తమకు తీరని అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లేటి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము సత్తిబాబు, మండల అధ్యక్షుడు నేకూరి రవికుమార్ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ జబువంటి ముఖ్యమంత్రికి తగిన గుణపాఠం చెప్పే సమయం దగ్గరపడిందన్నారు. తరి తవాడలో ఎమ్మార్పీఎస్ రథయాత్ర ద్వారా ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిలకు ఓటువేసి గెలిపించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లేటి వెంకట్రావు, నాయకులు లంక వస పల్లేటి సుబ్బారావు, నేమూరి అబి పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్ద లోకేశ్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, మే6: వేమగిరి ప్రజాగళంలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు సోమవారం మధురపూడి విమానాశ్రయం వద్ద టీడీపీ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తిరిగి వెళుతున్న లోకేష్‌కు విమానాశ్రయం వద్ద నాయకులు కలిశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

దివాన్‌చెరువు, మే6: జాతీయ రహదారిపై పుష్కరవనం సమీపంలో సోమవారం లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన దారా రాజేష్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ బజాజ్ పల్సర్‌పై రాజానగరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ డ్రైవర్ లారీని అజాగ్రత్తగా నడిపి మోటారు సైకిల్‌ను ఢీకొన్నాడు. దీంతో రాజేష్ లారీ వెనుక చక్రాలకింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు తెలిపారు. లారీని పోలీసులు అ దుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం.. ఒకరి మృతి

ఎటపాక, మే6: ప్రమాదశాత్తు అదుపుతప్పి ద్విచక్ర వాహనం చెట్టుని ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందారు. నెల్లిపాక గ్రామానికి చెందిన టి.నాగవెంకటనర్సయ్య (42) ఆదివారం సాయంత్రం ఓ పని నిమిత్తం లక్ష్మీపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో లక్ష్మీపురం శివారు ప్రాంతం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుని ఢీకొంది. ఈప్రమాదంలో నాగవెంకట నర్సయ్య తల,ఛాతిభాగంలో తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రుని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు నాగ వెంకటనర్సయ్య ఆదివారం రాత్రి మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల చేపల వేట

కూనవరం, మే6: ప్రతీ వేసవి కాలంలో గిరిజన గ్రామాల్లో జరిగే చేపల వేట పండుగలను కూనవరం గ్రామ గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఇంటిలోని ప్రతీ వ్యక్తి చేపల వేటకు వెళ్లి గిరిజన సాంప్రదాయబద్ధంగా వేటను కొనసాగిస్తారు. దొరికిన చేపలను ప్రతీ కుటుంబానికి పంచుకుంటారు. దీనిలో భాగంగా సోమవారం జరిపిన చేపల వేటలో సుమారు 1000కేజీల చేపలు లభ్యం కావడంతో గ్రామంలోని ప్రతీ గిరిజన కుటుంబానికి వాటాలుగా పంచుకున్నారు. దీంతో ఆగ్రామంలో రాత్రి వేళలో జరిగే సాంప్రదాయ పండుగ సంబరాలు జరుపుకున్నారు.





దొరికిన చేపలను వాటాలుగా వేసుకున్న గిరిజనులు, గిరిజనుల చేపల వేట

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

● రానున్నది కూటమి ప్రభుత్వమే..
● గోరంట్ల సమక్షంలో టీడీపీలో పలువురు చేరిక

కడియం/రాజమహేంద్రవరంరూరల్, మే 6: రాజమహేంద్రవరం రూరల్ మునిసిపల్ కార్పొరేషన్ 16వ వార్డు బాలాజీపేట ఆదర్శనగర్‌లో గోరంట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వాసుపల్లి శివ ఆధ్వర్యంలో యువకులు, మహిళలు పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి వారికి పార్టీ కండువాలేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పనితీరుతో విసుగు చెందిన ఉమ్మడి మేనిఫెస్టో అన్నివర్గాలకు మేలు చేసే విధంగా ప్రవేశపెట్టారన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, ముఖ్యంగా యువత మార్పు కోరుకుంటున్నారన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో ప్రకారం ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, మహిళా సంఘాలకు రూ. 10లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, 19 ఏళ్ల వచ్చిన మహిళలకు రూ.1500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ వంటి పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించలేదని, యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తెలుగుదేశం సైకిల్ గుర్తుపైనా, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి బీజేపీ కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని గోరంట్ల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

కొండమెరక, గోదావరిగట్టు, తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్లకు సైకిల్ గుర్తుపైన పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. జనసేన నాయకులు యడ్ల మహేష్, టీడీపీ నాయకుడు ఆడపా శ్రీను, బీజేపీ నాయకుడు జి.సూరిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రకటించిన హామీలు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అల్లంపల్లి ముత్యాలు, కె. సుబ్బారావు, దిండి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం

ధవళేశ్వరం, మే 6: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం స్థానిక రథం వీధి,







16వ వార్డులో గోరంట్ల సమక్షంలో పార్టీలో చేరిన యువత, మహిళలు



కూటమిని గెలిపించండి : ప్రధాని మోదీ అభివాదం

మోదీ బాణం : విల్లు ఎక్కుపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ



మోదీ సభలో ప్రజలకు నమస్కరిస్తున్న పవన్

మోదీ సభలో లోకేశ్ అభివాదం

జనం మోదీ..

రాజమహేంద్రవరాన ఉప్పొంగిన ప్రజాగళం

- గోదారులన్నీ జన ప్రవాహమే
- జనంతో నిండిన రాజమహేంద్రి
- ఉభయ జిల్లాల నుంచి రాక
- కాసేపు తెలుగులో మాట్లాడిన మోదీ
- జ్ఞాపికలు అందజేసిన పవన్, లోకేశ్
- ప్రధాని మోదీ సభ విజయవంతం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి గడ్డపై నుంచి ప్రధాని మోదీ గర్జించారు. ఎన్నికల శంఖారావం పూరించారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచే కొత్త చరిత్ర సృష్టిస్తామని ప్రతినబూనారు. ఆదికవి నన్నయ సరికొత్త అధ్యాయం సృష్టించినచోటే ఎన్డీయే కూడా విజయఢంకా పూరిస్తుందని ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ దద్దరిల్లింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి పోటెత్తిన జనప్రవాహంతో మార్మోగింది. అటు ప్రధాని మోదీ, ఇటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితర దిగ్గజాల హాజరుతో సభ కొత్త కళ సంతరించుకుంది. వేలాది మంది కాషాయ టోపీలు ధరించి ఉత్సాహంగా మోదీమోదీ అంటూ నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. పవన్‌కల్యాణ్ వచ్చిన వెంటనే సభలో ఉన్న వేలాది జనం కేరింతలతో గోదావరి ఉప్పెనలా హోరెత్తింది. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రధాని మోదీ సభా వేదికపైకి రాగానే జనం నినాదాలు చేశారు. అటు తన ప్రసంగాన్ని మోదీ తెలుగులో ఆరంభించి అందరినీ అబ్బురపరిచారు. సభకు వచ్చిన రాజమహేంద్రవరం ప్రజలకు నమస్కారాలు అంటూనే గోదావరి తల్లికి తలవంచి నమస్కరిస్తున్నా అనడంతో ప్రాంగణం ఒక్కసారిగా మార్మోగింది. ఆదికవి నన్నయ నడయాడిన ఈ గడ్డ నుంచి ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతున్నామని చెప్పి గెలిచేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, నరసాపురం లోక్‌సభ అభ్యర్థులతో పాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రాజమహేంద్రవరం విమానాశ్రయం, కాకినాడ పోర్టు, జాతీయ రహదారి మరింత అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చెన్నై-కాకినాడ పారిశ్రామిక కారిడార్ పనులు ఊపందు కుంటాయని చెప్పి ఇక్కడ ప్రజల మనసు చూరగొన్నారు.

కూటమిలో ఫుల్ జోష్...

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, మే 6: కూటమి ఎన్నికల బహిరంగ సభకు విచ్చేసిన దేశ ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3:30 గంటలకు సభావేదికపైకి మోదీ చేరుకున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. తొలుత ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, రాజమహేంద్రవరం కూటమి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే కూటమి టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అమలాపురం లోక్‌సభ కూటమి టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కాకినాడ ఎంపీ జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నాయకులు అయ్యాజీ వేమా, కాశీవిశ్వనాథరాజు తదితరులు ప్రధాని మోదీని కలిశారు. సభా వేదికపైన కూటమి అభ్యర్థులను పలకరించారు. అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మోదీ దగ్గరకు వెళ్లి పలకరించగా ఆల్‌ద బెస్ట్ అని భుజం తట్టారు. అటు లోకేశ్ తన సరదా ప్రసంగంతో మోదీని ఆకట్టుకున్నారు. ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా మోదీ తినాలని అనగానే నవ్వులు పూశాయి. లోకేశ్ మాట్లాడే సమయంలో ఆయన ప్రసంగానికి మోదీ చప్పట్లు కొట్టారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని లోకేశ్ మోదీకి అందించారు. మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాను మోదీకి అందించారు. సభా వేదికపైకి మోదీ రాగానే పవన్ మోదీకి శాలువా కప్పారు. అనంతరం కాళ్లకు నమస్కరిస్తుండగా ప్రధాని వారించి అడ్డుకున్నారు. మోదీకి వేంకటేశ్వర స్వామి జ్ఞాపిక అందించారు. ఇలా ప్రజాగళం సభ రాజమహేంద్రవరంలో కూటమి పార్టీలకు మంచి కిక్ ఇచ్చింది. స్వయంగా మోదీ వచ్చి సభలో పాల్గొనడంతో అభ్యర్థుల్లో విజయంపై మరింత ధీమా పెంచేసింది.





చిరు కానుక : మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందిస్తున్న పవన్‌కల్యాణ్, జనసేన అభ్యర్థులు



ఇదీ మా సంప్రదాయం : ప్రధాని నరేంద్రమోదీకి జ్ఞాపిక ఇస్తున్న టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి మహిళా నేతలు



మోదీ కటౌట్‌తో..



అభిమాని ఉత్సాహం

ఆ ముగ్గురి కలయిక అపూర్వం : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్/సిటీ మే 6: ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి కలయిక అపూర్వం అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి రాజమండ్రి లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం విధానమైతే, బాధితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే పార్టీ జనసేన అన్నారు. కూటమి కలయిక రాష్ట్రంలో సుపరిపాలనకు దోహదపడుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. గడచిన ఐదేళ్లలో మనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డామని, ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం తన అదృష్టమని, ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె కోరారు.

కట్టుదిట్టమైన భద్రత

కూటమి ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. జనం తండోపతండాలుగా రావడంతో జాతీయ రహదారి నిండిపోయింది. మహిళలు సైతం అధిక సంఖ్యలో రావడం విశేషం. సభ పూర్తయ్యేంత వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ఓపికగా ఉన్నారు. మోదీ, పవన్, లోకేశ్ ప్రసంగాలకు పెద్దఎత్తున స్పందిస్తూ చప్పట్లతో, నినాదాలతో హోరెత్తించారు. ప్రజాగళం సభకు ప్రధాని మోదీ హాజరు కావడంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఒక అడిషనల్ డీజీ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు ఐజీలు, తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ సహా ఆరుగురు ఎస్పీలు.. మొత్తం సుమారు మూడు వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి చేరుకోవడానికి ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. 35 చెకింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ పరిశీలించి అనుమతించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర గస్తీ కాశాయి. భద్రతా చర్యల్లో భాగంగా వాటర్ బాటిల్, పెన్, సిగరెట్, అగ్గిపెట్టె, గుట్కా, పార్టీ జెండాలను అనుమతించలేదు. మోదీ రాకకు అరగంట ముందు నుంచీ.. ఆయన వెళ్లిన తర్వాత వరకూ వేదిక నుంచి హెలిపాడ్ వరకు జాతీయ రహదారిపై ఎవరినీ అనుమతించలేదు. రత్న ఫ్యాక్టరీ నుంచి వేమగిరి కూడలి వరకు పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. మోదీ వెళ్లిన తర్వాత జనం ఒక్కసారిగా తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. భద్రత దృష్ట్యా వాటర్ బాటిళ్లను తీసుకెళ్లనీయకపోవడంతో గ్యాలరీలు, బయట ప్రాంగణంలో లక్షల లీటర్ల మజ్జిగ అందుబాటులో ఉంచారు. తాగునీరు కూడా ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు.



కూటమి హ్యాపీగా ఉందిలా..



జయహో మోదీ..



అంతా ఓకేనా : ప్రధాని మోదీతో మాట్లాడుతున్న లోకేశ్



నమస్తే జీ : మోదీకి నమస్కరిస్తున్న ఆదిరెడ్డి భవాని



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న కూటమి అభ్యర్థులు



మోదీ సభకు..



బాగున్నారా సార్ : ప్రధాని మోదీకి నమస్కరిస్తున్న పవన్



మా కూటమి టీమ్ : ప్రజాగళం వేదిక నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. చిత్రంలో పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్, రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, కాకినాడ, అమలాపురం ఎంపీ అభ్యర్థులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్‌మాధుర్, అనపర్తి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



మీకోసమే సార్ : ప్రధాని మోదీకి శాలువా కప్పుతున్న లోకేశ్

ఓటుకు పోటెత్తిన ఉద్యోగులు

- జిల్లా వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- ఎక్కడికక్కడ క్యూకట్టిన ఉద్యోగులు..

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు ఓటుకు పోటెత్తారు.. గత ఐదేళ్లుగా ఎప్పుడెప్పుడు ఓటేద్దామా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.. ఎందుకంటే ఉద్యోగుల్లో అంత వ్యతిరేకత ఉంది. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ ఉద్యోగులు ఓటు వేయడానికి బారులుతీరారు. అన్ని జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి సోమవారం ఉద్యోగులు క్యూకట్టారు. గతంలో పోస్టల్ బ్యాలెట్‌కు ఇంత స్పందన ఉండేది కాదు. అయితే ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితి మారింది. ఉదయం నుంచి ఉద్యోగులు బారులు తీరారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పీవోలు, ఏపీవోలు, ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్, ఇతర అనుబంధ సిబ్బంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. ఎంత మంది వినియోగించుకున్నారనే లెక్క రాత్రి 12 గంటల వరకూ తేలలేదు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత జేసీ తేజ్‌భరత్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఓటు విలువను ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది చాటి చెప్పారన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో, ఏడు చోట్ల శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే 32 విభాగాల ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.రాత్రి 12 గంటలకు కూడా ఎంతమంది ఓటు హక్కు వినియోగించుకున్నారనే వివరాలు ప్రకటించ లేదు. కేవలం రాజానగరం నియోజకవర్గంలో మాత్రం 738 మందికి 703 మంది వినియోగించుకు న్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ దాదాపు ఓటింగ్ శాతం ఇలాగే ఉన్నట్టు సమాచారం.



నిడదవోలులో ఓటు వేస్తున్న ఉద్యోగి



దివాన్‌చెరువులో ఉద్యోగుల క్యూ

దివాన్‌చెరువు, మే 6 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల విధులకు నియమితులైన పీవో, ఏపీవోలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. పాలచర్లలోని బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే ఏర్పాటు చేశారు. ఆర్వో చైత్రవర్షిణి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ 50 మంది ఓటర్లకు ఒక ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఓటింగ్ ప్రాంభమైందన్నారు. రాజానగరం నియోజవర్గానికి 460 మంది పీవో, ఏపీలను కేటాయించారన్నారు. వీరిలో నియోజకవర్గాల వారీగా రాజానగరంలో 40, అనపర్తిలో 17, రాజమండ్రి సిటీలో 95, రూరల్‌లో 75, కొవ్వూరులో 27, నిడదవోలు 44, గోపాలపురం 28, ఇతర జిల్లాలకు చెందిన 128 మంది ఉన్నారన్నారు. మొదటి రోజు పీవో, ఏపీవోలతో పాటు మరో 260 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. వీరు బీఎల్‌వోలు, ఎన్నికల విధులకు నియమితులైన వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 7,8 తేదీల్లో ఆర్వో కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 8న ఓపీవోలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును బీవీసీ కళాశాలలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా 100 మంది ఓటర్లలోనూ, 98 మంది ఓటు వేశారని ఆర్వో తెలిపారు.



కొవ్వూరులో ఎండలో నిలబడే ఓటుకు ఉద్యోగుల క్యూ



పోస్టల్‌బ్యాలెట్‌లో ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఎన్నికల సిబ్బంది

గోపాలపురాన ఓట్లు మాయం..?

నిలదీసిన ఉద్యోగులు.. ఆలస్యంగా ఓటింగ్

గోపాలపురం, మే 6: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి సోమవారం మొదటి విడత పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు ప్రక్రియలో గందరగోళం నెలకొంది. గోపాలపురం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి సోమవారం ఉదయమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేయడానికి 11 ఫెషిలిటియేటర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అయితే జాబితాలో తమ పేర్లు కనిపించకపోయేసరికి గందరగోళం ఏర్పడింది. తమ పేరు జాబితాలో లేదని కంగారుపడిన ఎన్నికల సిబ్బంది ఏఈఆర్వోను నిలదీశారు. దీంతో విషయం తెలుసుకున్న ఆర్వో సమస్యను పరిష్కరించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ఓట్లు ప్రక్రియ ప్రారంభమైంది.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాబోయేది చంద్రబాబు ప్రభుత్వమే

మాదిగ మహానాడు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు శ్రీకాంత్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ మహానాడు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

కొవ్వూరు, మే 6: రాబోయేది చంద్రబాబు ప్రభుత్వమేనని మాదిగ మహానాడు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు మిట్టా శ్రీకాంత్ అన్నారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో సోమవారం మాదిగ మహానాడు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చంద్రన్న మాటే.. మాదిగల బాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ అసోసియేషన్ 5 నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో వలంటీర్లుగా పనిచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళిత బహుజనులు ఇబ్బందులకు గురయ్యారని, హత్యలకు గురైన వారున్నారన్నారు. కార్పొరేషన్లు పెట్టి నిధులు, విధులు లేకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జగన్ ప్రభుత్వంలో దళిత బహుజనులను ఇబ్బందులకు చేసి దాడిచేసిన వారిపై కమిటీ వేసి శిక్షించాలన్నారు. మాదిగలు తమ హక్కులు సాధించడానికి పూర్తి మద్దతు ఇచ్చినందున తమ అసోసియేషన్ టీడీపీకి పూర్తి మద్దతిస్తోందన్నారు. జగన్ మేనిఫెస్టోలో దళితుల ఊసే లేదన్నారు. కార్పొరేషన్‌లో ఉన్న ప్రతి ఒక్క రూపాయి దారి మళ్లించి ఉపాధి దెబ్బతీశారన్నారు. జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టులాగా మే 13న జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడిపాటి బాజి, జిల్లా అధ్యక్షుడు పసలపూడి జోషి, ఇందుగు మిల్లి రమేష్, పసలపూడి హరిబాబు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, నాదెళ్ల శ్రీరామ్, మద్దిపట్ల సురేష్, అర్జిల్లి రామకృష్ణ, బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్



గూడ్స్ రైలు పట్టాలు తప్పిన దృశ్యం

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ఓ గూడ్సు రైలు పట్టాలు తప్పింది. పారాదీప్ నుంచి బళ్లారి ఎరువుల లోడుతో వెళ్తున్న గూడ్సు రైలు సోమవారం ఉదయం 6.30గంటలకు రైల్వే స్టేషనులోని రెండో ప్లాట్‌ఫాంకు చేరుకుంటున్న సమయంలో ఓ బోగీ రెండు చక్రాలు పట్టాలు తప్పాయి. స్టేషనుల్లో కావడంతో రైలు నెమ్మదిగా ప్రయాణిస్తుండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పట్టాలు తప్పిన బోగీని వేరుచేసి రైలును పంపించేశారు. పట్టాల ఇబ్బంది వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి



దేవరపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మద్దిపాటి

దేవరపల్లి, మే 6: దేవరపల్లిలో సోమవారం సాయంత్రం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇదిలా ఉండగా వేమగిరిలో జరిగిన ప్రధాని మోదీ ఎన్ని కల ప్రచార సభకు మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో, బైక్‌లు, కారుల్లో భారీగా వెళ్లారు. దేవరపల్లి నుంచి వెళ్లే బస్సును టీడీపీ నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. గౌరీపట్నంలో మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు వెళ్లాయి. కార్యక్రమాల్లో ఆండ్రూ అనీల్, సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ, వెంకటేశ్వరరావు, వైశ్రీనివాస్, అనిశెట్టి గంగరాజు పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే 6: ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీలు బహిరంగ సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నాయి. మంగళవారం ఉదయం సీఎం జగన్ కోరుకొండలో రోడ్‌షో నిర్వహించనున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం రోడ్డులో సీఎం జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు రోడ్‌షో నిర్వహించారు. ఇప్పుడు కూడా సరిగ్గా అదే ప్రాంతంలో రోడ్‌షో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సీఎం జగన్ రోడ్ షోకు రాజానగరం నియోజకవర్గం నుంచి ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించడానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగంలోకి దిగారు. గ్రామాల వారీ జన సమీకరణ చేపట్టారు.

ఎన్నికల విధులు నిబద్ధతతో నిర్వర్తించాలి

▸▸ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్



కొవ్వూరులో పీవో, ఏపీవోలకు శిక్షణ ఇస్తున్న కమల్‌కాంత్ సరోచ్

కొవ్వూరు, మే 6: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోచ్ అన్నారు. కొవ్వూరు సుందరసాయి కళ్యాణ మండపంలో సోమవారం రెండో శిక్షణా తరగతులు నిర్వహించారు. కమల్‌కాంత్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. పోలింగ్ రోజున బూత్ వద్ద పోలింగ్ ముగిసే సమయానికి ఎంతమంది ఉంటే అందరికీ స్లిప్‌లు అందించి చివరి వ్యక్తి వరకు ఓటు హక్కు కల్పించాలన్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ బూత్ వద్ద లైన్‌లో ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ, పీవోలు, ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మైక్రో అబ్జర్వర్స్‌కు శిక్షణ: కలెక్టర్

రాజమహేంద్రవరం కల్చరల్, మే 6: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 1577 పోలింగ్ కేంద్రాల పరిధిలో 342 మంది మైక్రో అబ్జర్వర్స్ ఎన్నికల్లో బాధ్యతలు నిర్వహించనున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్స్ నేరుగా ఎన్నికల సాధారణ పరిశీలకులుగా జవాబుదారీతనం కలిగి ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, పోలింగ్ రోజున పోలింగ్ నిర్వహణ వ్యవస్థ తదితర అంశాలపై జిల్లాకు వచ్చిన ఇద్దరు సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోచ్ స్వయంగా శిక్షణ అందిస్తారని, అవగాహన కల్పిస్తారని చెప్పారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం ఉదయం శిక్షణా కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన మైక్రో అబ్జర్వర్స్ స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొంటారని కలెక్టర్ చెప్పారు. సూక్ష్మ పరిశీలకులు ఎప్పటికప్పుడు సాధారణ పరిశీలకులకు నేరుగా నివేదికలను నివేదించాలని, పోలింగ్‌బూత్ స్థితి తదితర అంశాలపై పోలింగ్ ఏజెంట్లు, ఓటర్లు చేసిన ఫిర్యాదులను గమనించి, ఫిర్యాదుల తీవ్రత, స్వభావాన్ని అర్థం చేసుకొనే కీలక బాధ్యతలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

▸▸ కొవ్వూరు రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ

▸▸ పలుచోట్ల ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ



కొవ్వూరులో పోస్టల్ బ్యాలెట్ కోసం లైన్‌లో ఉన్న ఎన్నికల సిబ్బంది

కొవ్వూరు, మే 6: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతిఒక్కరూ పోస్టల్‌బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కొవ్వూరు సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. సోమవారం కొవ్వూరులోని శ్రీ సుందరసాయి కళ్యాణ మండపంలో పీవో, ఏపీవోల శిక్షణా కార్యక్రమం అనంతరం పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్, ఇతర సిబ్బందికి పోస్టల బ్యాలెట్ ఓటు సౌకర్యం కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది తమ డ్యూటీ ఉత్తర్వులు, ఎలక్షన్ ఐడీ కార్డు తీసుకువస్తే ఫారం-12 స్వీకరించి, సంబంధిత అధికారులు వారికి ఓటరు స్లిప్స్ జారీ చేసి, పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించడానికి వచ్చిన సిబ్బందికి ఏమైనా సమస్యలు ఎదురైతే పరిష్కరించడానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామన్నారు.

నిడదవోలు: నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణలో పీవోలు, ఏపీవోలకు రెండో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రమణ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యా లెట్‌ను వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో పీవోలు, ఏపీవోలు ఇతర పోలింగ్ సిబ్బందితో కలిసి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. శిక్షణా కార్యక్రమం అనంతరం పీవోలు, ఏపీవోలు అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సెల్స్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



సమిశ్రగూడెంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న ఎన్నికల సిబ్బంది

కూటమి గెలుపుతో కొవ్వూరు అభివృద్ధి సాధ్యం

▸▸ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు 20వ వార్డులో ప్రచారం చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 6: కొవ్వూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కొవ్వూరు లోని 20వ, 1వ వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ అధికారం కోసం గత ఎన్నికల్లో అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజ లను మోసగించిన జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. వైసీ పీ ఐదేళ్ల పాలనలో ఇసుక డ్రెజ్జింగ్‌తో గోదావరి నది గర్భాన్ని దోచుకున్నారన్నారు. దీంతో రోడ్డు కం రైలు బ్రిడ్జి, గామన్ బ్రిడ్జిల మనుగడ దెబ్బతిన్నాయన్నారు. కాగా కోవిడ్ సమయంలో కొ వ్వూరులో రద్దు చేసిన పలు రైళ్ల హాల్ట్‌ను ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి సహకారంతో పునరుద్ధరిస్తానన్నారు. నియోజకవర్గ అభి వృద్ధి కోసం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నాయన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయంతోనే అభివృద్ధి వైపు అడుగులు వేయగలమని, అభ్యర్థులకు విజయాన్ని అందించాలని కోరుతూ రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో గుండు బోగుల ప్రసాదు, అయితం మణికంఠ, ఇందుగుల రామకృష్ణ, కలిశెట్టి సన్యాసి నాయుడు, కిల్లాని మహేష్, మెట్టా సూర్య, దూళ్ల నాగు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో మాజీ సర్పంచ్ ఆళ్ల ఇందిరరాణి మహిళా నాయకులతో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. డమ్మీ ఈవీఎంలను ప్రదర్శిస్తూ ఒక ఓటు కమలం గుర్తుపైన, మరో ఓటు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మహిళ సాధికారత, మహిళల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆమె అన్నారు. కార్యక్రమంలో దొంగ రమ్య, కేతా స్వర్ణలత, ఎం.మృదుల, కోడూరి సత్యవాణి, వేంద్ర విజయలక్ష్మి, జొన్నకూటి వెంకాయమ్మ, పాల్గొన్నారు. దారవరంలో అసెంబ్లీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాతతో కలిసి స్థానిక మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

● టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి దుర్గేష్



సూర్యారావుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కందుల దుర్గేష్

ఉండ్రాజవరం, ఏప్రిల్ 6: వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం మండలంలోని సూర్యారావుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ఉమ్మడి అభ్య ర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని శేషారావు విమర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదానికి గురైన గ్రామానికి చెందిన మార్లపూడి రాజును పరామర్శించి శేషారావు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వల్లేపల్లి రాజా, సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ, నందిన శ్రీనివాస్, మద్దుకూరి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



నిడదవోలులో ప్రచారం చేస్తున్న దుర్గేష్ కుమార్తె రంగప్రియ

నిడదవోలు: నిడదవోలులోని 5వ, 20వ వార్డుల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ కుమార్తె ఈలి రంగప్రియ జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి అందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కందుల దుర్గేష్‌కు గాజుగ్లాసు గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలన్నారు. కార్యక్రమాల్లో జనసేన అధ్యక్షులు రంగా రమేష్, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌పై దాడి అవాస్తవం

▸▸ ఎస్‌డీపీవో హనుమంతరావు

కాకినాడ క్రైం, మే 6: సినీ నటుడు సాయిధరమ్‌తేజ్‌పై దాడి జరిగిందని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అంశం అవాస్తవమని కాకినాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) కె.హనుమంతరావు పేర్కొన్నారు. కాకినాడలోని ఆయన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌డీపీవో ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. జనసేన పార్టీకి మద్దతుగా సాయిధరమ్‌తేజ్ ఎన్నికల ప్రచారం(రోడ్‌షో)ఆదివారం గొల్లప్రోలు మండలంలోని తాటిపర్తిలో రోడ్‌షో జరుగుతుండగా అగంతకులు గాజుబాటిల్‌తో సాయిధరమ్‌తేజ్‌పై దాడి చేయడంతో అతనికి త్రుటిలో ప్రమాదం తప్పి పక్కనే ఉన్న నల్ల శ్రీధర్ అనే వ్యక్తికి గాయమైనట్టు సామాజిక ప్రచార మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. వెంటనే అప్రమత్తమైన జిల్లా పోలీస్ శాఖ యుద్ధ ప్రాతిపదికన విచారణ చేపట్టినట్టు ఎస్‌డీపీవో వెల్లడించారు. అయితే సాయిధరమ్‌తేజ్ రోడ్‌షో నుంచి వెళ్లిపోయిన పావుగంట తరువాత ఈ సంఘటన జరిగినట్టు అక్కడ గాజుబాటిల్ ఆనవాళ్లు కూడా లేనట్టు, శ్రీధర్‌కు రాయి తగిలినట్టు విచారణలో నిర్ధారణయినట్టు ఎస్‌డీపీవో స్పష్టం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రత్యేకత సంతరించుకున్న పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఇటువంటి అవాస్తవాలు హల్‌చల్ చేస్తే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. అభ్యర్థులు, వారి అనుచరగణం ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు చేసుకోకుండా సంయమనం పాటిస్తూ ఎన్నికల ప్రచారం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే సంఘటనా ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ఆకతాయిలు, సంఘ విద్రోహశక్తులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే ధోరణిలో కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలానికి ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యర్థులు ఒకరికొకరు ఎదురు పడకుండా సామరస్యంగా ఎన్నికలు ప్రచారం కొనసాగించాలని ఎస్‌డీపీవో హనుమంతరావు సూచించారు. శాంతియుతంగా సజావుగా ఎన్నికలు జరిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతో రైతాంగానికి మేలు

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



కొవ్వూరు ఎన్నికల ప్రచారంలో గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 6: రైతాంగానికి మేలు జరగాలంటే ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు కోరారు. సోమవారం కొవ్వూరులో ఆయన, ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి 9 గ్యారెంటీల కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం పంటకు గిట్టుబాటు ధరలు రావాలంటే కాంగ్రెస్ రావాలన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ వల్లనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో తనకు, అరుణకుమారికి హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం రాజమహేంద్రవరంలో సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్‌లో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించాని కోరారు.

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం, సూర్యనారాయణపురం, కృష్ణంపాలెం, ధూమంతనగూడెం, కొత్తగూడెం, రామన్నపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మార్టిన్‌లూథర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జ్యేష్ట సతీష్, వెలగా రామకృష్ణ, కాకర్ల శ్రీహరిబాబు, చైతన్య పాల్గొన్నారు.

కూటమి బహిరంగ సభకు విశేష స్పందన

● బస్సులు, ఆటోలు, బైకులపై తరలిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

● ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

దివాన్‌చెరువు/రాజానగరం, మే 6: వేమగిరిలో జరిగిన కూటమి బహిరంగ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతం నుంచే ప్రజలు బహిరంగ సభకు తరలి వెళ్లడం కానవచ్చింది. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్సులు, ఆటోలు, బైకులపై సభకు తరలివచ్చారు. సభా ప్రాంగణానికి చేరుకునేందుకు జాతీయ రహదారిపై ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. విశాఖ, తుని, కాకినాడవైపు నుంచి వచ్చే భారీ వాహనాలను దివాన్‌చెరువులోని జీరో జంక్షన్ వద్ద నుంచి గామన్ బ్రిడ్జి మీదుగా దారి మళ్లించారు. సభకు వెళ్లే బస్సులతో పాటు టాక్సీలు, ఇతర వాహనాలను యథావిధిగా రాకపోకలు సాగించాయి. దూర ప్రాంతాల నుంచి బహిరంగ సభకు వెళ్లే వారు జాతీయ రహదారి వెంబడి ఉన్న చెట్ల నీడన భోజనాలు ముగించుకుని ముందుకు సాగారు. కొవ్వూరు వైపు నుంచి బహిరంగ సభకు వచ్చే బస్సులను దివాన్‌చెరువు సమీపంలోని జీరో జంక్షన్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకున్నాయి. దివాన్‌చెరువు వైపు నుంచి లాలాచెరువుకు వెళ్లాల్సిన లోడు లారీలను ఉదయం 9 గంటల నుంచే పోలీసులు అనుమతించలేదని దీంతో రోడ్డు పక్కన జీవో జంక్షన్ వద్దనే వాహనాలను నిలిపివేయాల్సి వచ్చిందని వాహనదారులు వాపోయారు.

నేటికీ అందని పింఛన్లు

▸▸ చిట్యాలలో 9మంది లబ్ధిదారులు ఎదురుచూపులు

▸▸ ఆ జాబితాలో గ్రామ సర్పంచ్ ఉండడం గమనార్హం

గోపాలపురం, మే 6: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల వలంటీర్లను తప్పించి ఆ విధులను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. ఈ నెల ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని మార్చుకోవడంతో సామాజిక భద్రత పింఛన్‌దారులకు పింఛన్‌ను అందించేందుకు రెండు విధాలుగా ప్రణాళిక రూపొందించారు. మొదటిగా బ్యాంక్ అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరికి వారి ఖాతాలో జమ చేసేలా, 2వ విధానంలో నడవలేని స్థితిలో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే పింఛన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గోపాలపురం మండలంలోని చిట్యాల గ్రామంలో 689మందికి సామాజిక పింఛన్లు అందజేయాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల 13మందికి బ్యాంక్ అకౌంట్‌లో జమ కాలేదు. దాంతో వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 3న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సొమ్మును బ్యాంకు నుంచి విత్‌డ్రా చేశారు. 13 మందిలో నలుగురికి పింఛన్ ఇచ్చి 9మందికి ఇవ్వలేదు. అడుగుతుంటే అదిగో ఇస్తాను.. ఇదిగో ఇస్తాను అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో ఆ 9 మంది తమకు పింఛను రాదేమోనని ఆందోళన చెందుతున్నారు. వారిలో ఆ గ్రామ ప్రథమ పౌరురాలు నూతంగి సరోజిని ఉండటం గమనార్హం.

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోలేదు

ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న లింగమల్లు శ్రీనివాసరావు

నల్లజర్ల, మే 6: రాష్ట్రంలో ఉన్న 20లక్షల మందికి పైగా ఉన్న భవన నిర్మాణ కార్మికులను ఈ ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం దూబచర్లలో జరిగిన శ్రీ వినాయక ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అండ్ ప్లంబింగ్ వర్క్ అసోషియేషన్ 9వ వార్షిక మహాసభలో ఆయన మాట్లాడుతూ 40వేల పెండింగ్ క్లైమ్‌లలో ఒక్కటి కూడా పరిష్కరింలేదన్నారు. బీవోసీ బోర్డు నుంచి కనీసం మట్టి ఖర్చులకు కూడా ఒక్క క్లైమ్ పరిష్కారం కాలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికుల సత్తా చూపించాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోరే పార్టీని ఎన్నుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయుడు గంగాధరరావు, తొంటా సుమన్, గోవాడ కోటేశ్వరావు, బోరా సతీష్, పత్తిపాటి రాజు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు లండన్ నుంచి..

నిడదవోలు చేరుకున్న సాఫ్ట్‌వేరు యువకులు



నిడదవోలు, మే 6: ఆ యువకులు ఇద్దరూ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. ఎక్కడున్నా సొంత గ్రామం, సొంత రాష్ట్రం అంటే విపరీతమైన అభిమానం. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు లండన్ నుంచి నిడదవోలు చేరుకున్నారు. ఈ ఇద్దరిలో ఒకరు నిడదవోలు మండలం శెట్టిపేటకు చెందిన ప్రమోద్ కాగా మరొకరు తాళ్లపాలెం గంధం లోకేశ్. లోకేశ్ మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సరైన అభ్యర్థికి ఓటు వేసి ఎన్నుకోవాలన్నారు. నిడదవోలు అభివృద్ధికి మేము సైతం అంటూ ఓటు హక్కును వినియోగించుకునేందుకే లండన్ నుంచి వచ్చామని తెలిపారు.

వేమగిరి తరలిన కూటమి నాయకులు



కానూరు అగ్రహారం నుంచి వేమగిరి వెళుతున్న కూటమి కార్యకర్తలు

పెరవలి, మే 6: రాజమహేంద్రవరం సమీపంలో వేమగిరి వద్ద జరిగిన ఉమ్మడి పార్టీల సమావేశానికి పెరవలి మండలం నుంచి అధికసంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌లతోపాటు ఆయా పార్టీల ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నందున ఆయా గ్రామాల నుంచి మూడు పార్టీల కార్యకర్తలు అధికసంఖ్యలో వెళ్లారు. కానూరు, తీపర్రు, కానూరు అగ్రహారం, పెరవలి, ఖండవల్లి, ముక్కామల, అన్నవరప్పాడు తదితర గ్రామాల నుంచి బస్సులు, కార్లు, మోటారుసైకిళ్లపై పురుషులతోపాటు మహిళలు తరలి వెళ్లారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

దేవరపల్లి, మే 6: దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించగా గోపాలపురం మండలం బుచ్చయ్యపాలెంలో 30లీటర్ల సారాతో ఒక మహిళను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఈబీ సీఐ కేవీ.స్వామి తెలిపారు. అలాగే నల్లజర్ల మండలం తెలికిచర్లలో 10 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల.. టీడీపీలో పలువురి చేరిక



గోరంట్ల సమక్షంలో పార్టీలో చేరిన యువత, మహిళలు

కడియం/రాజమహేంద్రవరం రూరల్, మే 6: ప్రజల్లో మార్పు మొదలైందని, ముఖ్యంగా యువత మార్పు కోరుకుంటున్నారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మునిసిపల్ కార్పొరేషన్ 16వ వార్డు బాలాజీపేట ఆదర్శనగర్‌లో వాసుపల్లి శివ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. గోరంట్ల కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాగళం పేరుతో విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టో అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ప్రవేశపెట్టారన్నారు. ఏడాదికి ఉచితంగా 3సిలెండర్లు, మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, 19 ఏళ్లు వచ్చిన మహిళలకు రూ.1500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ వంటి పథకాలను వివరించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి గెలిపించాలని కోరారు.